క్లుప్తంగా

18న ఎరువుల వేలం

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో రెండేళ్ల క్రితం అక్రమంగా నిల్వ చేసిన ఎరువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూ.86,985 విలువైన ఎరువులను ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఏఓ ఇంటూరి భాస్కరరావు తెలిపారు. గ్రామంలోని ఎరువు సీజ్ చేసిన ఇంటి వద్దే వేలం ఉంటుందని, కనీస ధరావత్తు రూ.10 వేలు చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు రూ.600 చెల్లించాలి

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజుకు రూ.600 చెల్లించడమే కాక ఏటా 200 రోజుల పనిదినాలు కల్పించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. మండలంలోని వేపకుంట్లలో గురువారం నాయకులు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. ఇకనైనా నిధులు కేటాయించడమే కాక అడిగిన వారందరికీ పని కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు ఆర్.శివలింగం, ఆవుల మంగతాయి, కూరాకుల నరసయ్య, గుణగంటి వీరబాబు, కంటెపూడి ఇశ్రాయేలు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల మరణించిన చిమ్మపుడికి చెందిన మార్బుల్ కార్మికుడు షేక్ మసూద్ బాధిత కుటుంబ సభ్యులకు మార్బుల్ యూనియన్ తరుపున గురువారం షేక్ రహీం పాషా రూ.15,000లు ఆర్థిసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు షేక్‌మీరా, కోటి, షేక్‌జాని, నాగయ్య, షేక్ రఫీ, నాగేశ్వరరావు, షరీఫ్, రషీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్‌లోని కొలిపాక ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కంటివెలుగు సెంటర్‌ను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళ్లను పరీక్షించుకోవడంతో పాటు, అద్దాలను ఉచితంగా పొందాలన్నారు. సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు నాగండ్ల కోటి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు మందుల పంపిణీ



మందులు అందజేస్తున్న వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారులకు గురువారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నగరంలోని సంకల్ప డే కేర్ సెంటర్ రితన్య హాస్పిటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ హెమటాలజిస్ట్ దండముడి రమణ మాట్లాడుతూ.. వేసవిలో రక్తం అందుబాటులో లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నందున ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం చిన్నారుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తల్లిదండ్రులకు వివరించారు. డాక్టర్ నారాయణమూర్తి, సంస్థ ఉపాధ్యక్షుడు పావని, కోశాధికారి ప్రొద్దుటూరు రవిచందర్, ఉదయ్‌భాస్కర్, అనిత పాల్గొన్నారు.

రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రం

ఖమ్మంరూరల్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు గురువారం రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రపటాన్ని వేశారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.



అంబేడ్కర్ చిత్రపటాన్ని వేస్తున్న నాగేశ్వరరావు



అంబేడ్కర్ చిత్రపటం

ఆక్రమణలతో అవస్థలు

- రహదారులు, డ్రెయినేజీపైనే నిర్మాణాలు
- ఆపై అద్దెకు ఇస్తూ ఆదాయం పొందుతున్న అక్రమార్కులు
- కుంచించుకుపోయిన రోడ్లతో వాహనదారుల ఇక్కట్లు
- గాంధీచౌక్ పరిసరాల్లో ఇదీ పరిస్థితి



బర్మాషెల్ రోడ్డులో డ్రెయినేజీలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, రహదారిపై తోపుడుబండ్లు



సుందర్ టాకీస్ వీధిలో రోడ్డుపైనే సామగ్రి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలో రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో రహదారులు ఆక్రమణకు గురికావటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపార కేంద్రంగా నిత్యం రద్దీగా ఉండే గాంధీచౌక్ పరిసర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. గాంధీచౌక్ నుంచి ఉన్న బర్మాషెల్, సుందర్ టాకీస్, గూడ్స్‌షెడ్, ఉమెన్స్ కాలేజీ, రైల్వేస్టేషన్, మోహన్, రాఘవా టాకీస్ తదితర రోడ్లలో రహదారులు, డ్రెయినేజీలపై కొందరు వ్యాపారులు నిర్మాణాలు చేపట్టారు. కొందరు సొంతంగా వ్యాపారం చేస్తుండగా.. మరికొందరు అద్దెకు ఇచ్చారు. గాంధీచౌక్ నుంచి మధ్య గేటు వరకు ఉన్న రహదారి, సుందర్ టాకీస్ నుంచి ఉన్న బర్మాషెల్ రోడ్డు, గూడ్స్‌షెడ్ రోడ్లలో డ్రెయినేజీలపై, వాటిని కూడా దాటి రహదారుల పైకి నిర్మాణాలు ఉన్నాయి. చాలా మంది వ్యాపారులు తమ షాపులను దాటి సరుకులను రహదారికి ఆనుకుని పెడుతుండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే, ఈ రహదారుల వెంట చిరు వ్యాపారులు తోపుడు బండ్లు ఏర్పాటు చేయడంతో రహదారులు కుచించుకుపోయాయి. ఆక్రమణలకు గురై ఇరుకుగా మారిన ఈ రోడ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఆక్రమణ.. ఆపై అద్దెకు

కొందరు వ్యాపారులు తమ షాపుల ముందు రహదారులు, డ్రెయినేజీలను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తుండగా, మరికొందరు నిర్మాణాలు చేసి ఇంకొందరికి అద్దెకు ఇచ్చారు. ఆక్రమించిన స్థలాల్లో చేపట్టిన వ్యాపార దుకాణాన్ని రూ.10 వేల నుంచి రూ. 12 వేల వరకు కూడా అద్దెకు ఇచ్చినట్లు తెలుస్తోంది. వీరు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల అండగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

కేఎంసీ దృష్టి సారిస్తేనే..

ఖమ్మం మున్సిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందటంతో పాటు వ్యాపార రంగంలో దూసుకెళ్తోంది. అయితే అందుకు అనుగుణంగా వ్యాపార ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. ప్రధానంగా గాంధీచౌక్ నుంచి కాల్వొడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మించినా, పరిసర ప్రాంతాల రహదారులపై కార్పొరేషన్ దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా ఆక్రమణలను తొలగించి ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్ల అభివృద్ధితోనే పరిష్కారం



కారణాలు ఏమైనా గాంధీచౌక్ పరిసరాల్లో రహదార్లు కుచించుకుపోతున్నాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్య గేటు పడితే ఈ మార్గంలో వెళ్లలేకపోతున్నాం. ఆక్రమణలను తొలగించి రహదారులను అభివృద్ధి చేస్తే సౌకర్యంగా ఉంటుంది. వ్యాపారాలు కూడా వృద్ధి చెందుతాయి.

– గుంటుపల్లి దివాకర్ గుప్తా, గాంధీచౌక్, ఖమ్మం

సమస్యల పరిష్కారానికి కృషి



గాంధీచౌక్ పరిసరాల్లో ప్రజలు, వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అందరూ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేసుకుంటే మంచిది. రహదారులు, డ్రెయినేజీల ఆక్రమణను పరిశీలించి కార్పొరేషన్ అధికారుల సహకారంతో తగిన చర్యలు తీసుకుంటాం.

– పసుమర్తి రామ్మోహన్ రావు, కార్పొరేటర్, 36వ డివిజన్

పర్మిషన్ ఫీజులు తగ్గించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ ప్రొఫెషనల్ సెమిస్టర్ వైజ్ పర్మిషన్ ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేయూ వీసీ దిష్టిబొమ్మ దహనం చేశారు. గురువారం స్థానిక కేయూ సబ్ క్యాంపస్ ఎదుట జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ మాట్లాడుతూ...యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, పీజీ ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల యొక్క బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు పరీక్ష పేరుతో యూనివర్సిటీ అధికారులు విద్యార్థులను దోచుకుంటున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అన్ని యూజీ, పీజీ నాన్ ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మణ్, సాయి, రాకేష్, శివ, గణేష్, రవి, తరుణ్, నవ్య, సింధు, శిరీష పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

ఖమ్మంమామిళ్లగూడెం: హైదరాబాద్‌లో శుక్రవారం జరగనున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్.అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్, వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో రవికుమార్, నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా శుక్రవారం ఉదయం 7 గంటలకు అంబేడ్కర్ సెంటర్ వద్ద నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గుంతెటి వీరభద్రం, కొరిపల్లి శ్రీనివాస్, తొగర భాస్కర్, హెచ్.ప్రసాద్, ఆరెంపుల వీరభద్రం, గంటా భీమయ్య, పి.జోషి, ఎర్ర గంగాధర్, కొప్పుల రామారావు, చామలేటి శ్రీనివాసరావు, నల్లపు రమేష్, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయ సాధనకు కృషి

తిరుమలాయపాలెం: జార్జిరెడ్డి ఆశయ సాధనకు విద్యార్థులు పోరాటాలు సాగించాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మాగి రాకేష్ అన్నారు. గురువారం మండలంలోని బచ్చోడులో జార్జిరెడ్డి 51వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్రెపాటి లెనిన్, రవి, నరేష్, మాగి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కూసుమంచి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. సంఘ బాధ్యురాలు రాణి పతాకావిష్కరణ చేయగా మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికిరణ్, కృష్ణారావు మాట్లాడారు. ఈ వేడుకల్లో కూసుమంచి, నాయకన్‌గూడెం హైస్కూల్స్ హెచ్‌ఎంలు రేల విక్రంరెడ్డి, భూలక్ష్మి, మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, బాబురావు, కృష్ణ, శ్రీనివాసరావు, నేతాజీ, రమేష్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుమలాయపాలెం: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. మండలంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలని, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్మకోమటి నాగేశ్వరరావు పులుగుజ్జు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, శంకర్, రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: అవామే ఎహింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హఫీజ్ జవ్వాద్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని మసీద్ మక్కాలో రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండి.జావిద్, డాక్టర్లు కూరపాటి ప్రదీప్, ఎంఎఫ్ గోపీనాథ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ షేక్ అలీ, మసీదు ఇమాం సయ్యద్ సలీం, భవాని సింగ్ పాల్గొన్నారు.

సొసైటీ సేవలు విస్తరిస్తాం

నేలకొండపల్లి: భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సేవలు మారుమూల గ్రామాల్లో సేవలు విస్తరించేందుకు ముందుకు సాగుతున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచందర్‌ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని వాసవి భవన్‌లో గురువారం సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సొసైటీ, నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలడుగు పూర్ణచందర్‌ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గెల్లా జగన్‌మోహన్ రావు ప్రకటించారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు యలమద్ది లెనిన్, కొత్తా రమేష్, దండా నరసింహారావు, మచ్చా రఘుపతిరావు, నంచర్ల దేవీ ప్రసాద్, లింగస్వామి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్ణచందర్‌ప్రసాద్

ప్రణాళికాయుతంగా చదవాలి



పట్టాలు అందజేస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రణాళికాయుతంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య సూచించారు. నగరంలోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాలలో యూకేజీ, ఐదో తరగతి విద్యార్థుల స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ప్రతిభ కనబర్చి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పాఠశాల డీజీఎం చేతన్‌మాథూర్, ప్రిన్సిపాళ్లు జి.నాగప్రవీణ, టీఎల్ఎన్.శర్మ, వైస్ ప్రిన్సిపాళ్లు రామకృష్ణారెడ్డి, సురేష్, ఇన్‌చార్జ్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్ట్‌కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

ఖమ్మం సహకారనగర్: సీమో ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు పలువురు పది లోపు ర్యాంకులు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 8వ తరగతి విద్యార్థి టి.శ్రీజిత్ గణిత ఒలింపియాడ్‌లో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించాడన్నారు. అంతేకాక ఏ.విహాన్ 2వ ర్యాంక్, బి.రోహన్ 4, జి.అర్జున్ 10వ ర్యాంక్‌తో పాటు అనేక మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మున్నేరులో గత వారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం జనరల్ ఆస్పత్రికి తరలించగా, సంబంధీకులు ఎవరూ రాలేదు. దీంతో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన మృతదేహానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

మహోన్నత వ్యక్తి.. అంబేడ్కర్

నేలకొండపల్లి: సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి బీఆర్.అంబేడ్కర్ అని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి అన్నారు. కాలేజీలో గురువారం జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, అందుకు అంబేడ్కర్ జీవితం ఆదర్శమన్నారు. అధ్యాపకులు డాక్టర్ ఆర్.వెంకట్రాజం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్.యం.రఫీ, జానకి రామారావు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, మాధవి, కవిత, అనిత, కె.శ్రీనివాస్, కోటేశ్వరరావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ఖమ్మం మామిళ్లగూడెం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా నగరంలోని జెడ్పీ సెంటర్‌లో ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ అధ్యక్షతన తొలుత రూరల్ పోలీస్‌స్టేషన్ నుండి మోటారు సైకిళ్లపై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పాలాభిషేకం చేసి మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, శ్యాం రాథోడ్, నాయకులు నూకల రామ్మోహన్‌రెడ్డి, వాసుదేవరావు, వీరభద్రం, మందా సరస్వతి, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ గుప్త, అనిత, భద్రం, దీకొండ శ్యాం, పాపారావు, శంకర్‌గౌడ్, కోటేశ్వరావు, పృథ్వీ రాథోడ్, వీరూగౌడ్, సాయిరాం పాల్గొన్నారు.



ఖమ్మం మామిళ్లగూడెం: అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న దృశ్యం

మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 14న మంచిర్యాలలో నిర్వహించనున్న ర్యాలీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాపోలు జయప్రకాష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ జావీద్, రాయల నాగేశ్వరరావు, మొక్కా శేఖర్ గౌడ్, మలీదు వెంకటేశ్వర్లు, సైదులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర



ఖమ్మంరూరల్: పాదయాత్ర చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో సామాజిక న్యాయాన్ని, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ పేరుతో నగరంలో గురువారం పాదయాత్ర నిర్వహించారు. పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరావు, నాయకులు వై.విక్రమ్, పి.రమ్య, జె.ఉపేందర్, శ్రీను, నాగేశ్వరరావు, పద్మ, వెంకటరమణ, దొడ్డ నరసింహారావు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: సీఐటీయూ చేస్తున్న పాదయాత్రలో భాగంగా మండలంలోని పెదతండా నుంచి జలగం నగర్ వరకు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి. మోహన్‌రావు మాట్లాడగా నాయకులు బి. దేవ్‌జీ, రత్నాకర్, శ్రీను, రవి, నరేష్, వెంకన్న, ప్రసాద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్‌లో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల వేతనం అందించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతూ గురువారం అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు సత్కరిస్తూ పొగడ్తలతో ముంచేస్తున్నారే తప్పా వారి జీతభత్యాల గురించి ఆలోచించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, నాయకులు నారాయణ, కాంతయ్య, మోహన్, పుల్లయ్య, వీరబాబు, బాబు పాల్గొన్నారు.

ఓబీసీలపై చిత్తశుద్ధి కరువు



పార్టీలో చేరుతున్న వారితో నాయకులు

కూసుమంచి: ఓబీసీలపై బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్వాలా నర్సింహారావు అన్నారు. పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం మండలంలో పల్లెపల్లెకు ఓబీసీ అనే కార్యక్రమాన్ని చేపట్టి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు పలువురు నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి ప్రభాకర్, ఓబీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖా సత్యనారాయణ యాదవ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకన్న, నరేష్, చంద్రశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై మంత్రికి వినతి

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టులోని న్యాయవాదుల సమస్యలపై గురువారం బార్ అసోసియేషన్ సభ్యుడు తాళ్లూరి దిలీప్ చౌదరి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. న్యాయవాద సమస్యల పరిష్కారానికి మరో రూ.100 కోట్ల బడ్జెట్ విడుదల చేయాలన్నారు. వినతిపత్రం పరిశీలించిన మంత్రి సంబంధిత శాఖవారితో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దిలీప్‌చౌదరి

వచ్చేనెల 28న విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలు

ఖమ్మం మామిళ్లగూడెం: విశ్వబ్రాహ్మణ సంఘం నగర కమిటీని వచ్చేనెల 28న ఎన్నుకోనున్నారు. ఈమేరకు తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు గురువారం సమావేశమై విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం చైర్మన్ విజయగిరి సదానందచారి మాట్లాడుతూ... మే 28న నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని, 18 ఏళ్లు నిండిన వారు ఈనెల 30న సాయంత్రం 5 గంటలలోగా సభ్యత్వం నమోదు చేయించుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరావుతో పాటు రాజేశ్వరావు, ప్రసాద్, పాపాచారి, నాగేశ్వరావు, వెంకటేశ్వరావు, నాగరాజుకుమార్ పాల్గొన్నారు.

నగరంలో 'ఫిష్ టన్నెల్' ఎగ్జిబిషన్

ఖమ్మంమయూరిసెంటర్: మహా నగరాలకు దీటుగా ఖమ్మంలో అందరినీ ఆకట్టుకునేలా ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని బోనకల్ రోడ్డులో లక్ష్మీగార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను నాలుగు ఎకరాల స్థలంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లుతో కలిసి మేయర్ ప్రారంభించారు. అనంతరం ఫిష్ టన్నెల్, అక్వేరియంల్లోని వందల రకాల చేపలను వారు చూసి మాట్లాడారు. నగరంలో ఎగ్జిబిషన్ ఏర్పాటుద్వారా 100 మంది స్థానిక మహిళలకు రెండు నెలల పాటు ఉపాధి కల్పిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నిర్వాహకులు తుమ్మ అప్పిరెడ్డి, అమర్లపూడి బాలశౌరి, విజయ్‌పాల్, నాయకులు మందడపు మనోహర్, ఆళ్ల అంజిరెడ్డి, కన్నం ప్రసన్నకృష్ణ, పారా శ్రీను, ఆదూరి రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిష్ టన్నెల్‌లోని చేపలను చూస్తున్న మేయర్, డీసీసీబీ, సుడా చైర్మన్లు, కార్పొరేటర్లు